
# ధర తగ్గింది



"ఏమండీ మిమ్మల్నే"

"............"

"పిలుస్తుంటే పలుకరేమండి"

"............"

"రాత్రింబగళ్లు రాతతప్పితే రాగిదమ్మిడి వచ్చేదిలేదు."

ఆఖరుమాట అమరయ్య చెవిలోదూరిన అరగంటకు తలయెత్తి భార్య ముఖములోకి సాభిప్రాయముగా చూచాడు. చిట్లా, అవర్జాలతో చిరకాలమునుంచి చివికిపోయిన అమరయ్యబుర్రకు భార్యమాటల లోని భావము బోధపడక, ఆమెవంక అర్థ రహితంగా చూస్తూ "అయితే! అసలు విషయం ఏమిటి?" అని అడిగాడు.

"ధరలన్నీ పూర్తిగా పడిపోయినయ్యట. చూచారా" అంది భార్య భ్రమరాంబ, చేతి లోని వార్తాపత్రిక భర్త కందిస్తూ. ధరలు పడిపోవటమువల్ల ఏ పట్టణములోని వర్తకుల కెంత నష్టము కల్గిందీ అంచనాలతో ఉన్న ఆ శీర్షికవంక అతను ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"అయితే చూడండి! ధరలన్నీ పూర్తిగా తగ్గిపోయినయికదా, రోజూ మీరు వెచ్చాలు తెచ్చేకొట్లో మామూలు రేట్లే వేస్తున్నారేమండి" అంది పద్దుపుస్తకము తీసి చూస్తూ.

"బజార్లో ధర తగ్గితే, మన కుమాత్రం వస్తువులధర తగ్గించడూ? నీ పిచ్చి కాకపోతే"

"మీ పిచ్చిలో సగము నాకూ అబ్బింది. పిచ్చిగాకపోతే ధర పడిపోయిందో అని దేశమంతా గోలపెట్టుంటే మామూలు రేట్లకే మనకెందు కంటగట్టాడు"

అమరయ్య ఆలోచనలో పడ్డాడు. భార్య చెప్పింది నిజమేమో అనిపించింది- లేకపోతే పత్రికలవాళ్లి కేంపట్టింది పనికి మాలిన రాతలు రాయటానికి? కాస్తో కూస్తో చదువుకుని వ్యాపారానుభవం ఉన్న తన కంటె భార్య నయమనిపించింది.

"అడిగిన మాటకు సమాధానం చెప్ప కుండా ఆలోచనలో పడటం మీకెప్పుడూ అలవాటే. పాలు, పెరుగువాళ్లు నా ప్రాణాలు తీస్తున్నారు. ఫస్టు తారీఖుపోయి పదిరోజులయినా మీకు యింకా జీతంరా లేదు. ఇవ్వాళయినా జీతమడిగి తీసుకుని రండి."

"నన్నుమాత్రం ఏంచెయ్యమంటావు చెప్పు. రాత్రింబగళ్లు యంత్రంలాగ పని చేస్తున్నా జీతం యివ్వవచ్చేసరికి షావుకా రుకి కష్టంకల్గి ఏవో సాకులు చెప్పి కాల యాపన చేస్తాడు. ఇవ్వాళ గట్టిగా అడిగి వస్తాను. సరేనా" అన్నాడు చేతిలోని అవర్జా పుస్తకాన్ని అవతలపెట్టూ.

"నాకు కట్టుకోటానికి సరైన గుడ్డలేదు సరేకదా, పిల్లలకయినా షట్టుమని రెండు చొక్కాలు లేవు. ఎప్పుడడిగినా ధరలు మండిపోతున్నై, తగ్గంగానె తెస్తానంటారు. ప్రక్కయిళ్లవాళ్ళంతా పదేసి చీరెలు కొనుక్కున్నారు. ప్రక్కభాగంలోని పంకజాక్షి పట్టుచీర కొనుక్కుంది. పెరుగుపోసే పేరిందేవి నెక్‌లెస్ చేయించు కున్నది. మనకంటె అదే నయం. నగలు, నాణ్యాలు లేకపోతే మానె కడుపునిండా భోజనం కూడా లేదు. బట్టలకు కూడా ధర తగ్గి కొనేవాళ్లు లేక గోలపెట్టు న్నారుట. ఇవ్వాళ పసిదానికయినా ఒక చొక్కాగుడ్డ పట్టుకురండి"

భార్య ఉపన్యాసము విని ఒక్క నిట్టూర్పువిడిచాడు. తన పూర్వచరిత్ర అంతా ఒక్కసారి గుర్తుకు వచ్చింది.

అమరయ్య తండ్రి అయిదెకరాల మాగాణి, ఆరుదూలాల మండువా లోగిలి కొడుక్కు అప్పగించాడు. స్కూల్ ఫైనల్ దాకా చదువు చెప్పించి మంచి సంబంధం చూసి పెళ్లిచేసి కళ్లుమూశాడు. తండ్రి పోవటంతో సంసారబాధ్యత నెత్తినపడ్డది. పుట్టి పెరిగిన ఊళ్ళోనే ఉండి వ్యవసా యము చేస్తూ కాలము గడుపుదామనుకు న్నాడు. పల్లెటూరి రాజకీయాలలో పడ కుండా ప్రక్కకు తప్పుకోటం సాధ్యము కాదని తెలుసుకోటానికి అతని కెంతో కాలం పట్టలేదు. పంటకాల్వ తగాదా దగ్గరనుంచి, పక్కా రాజకీయాలవరకు ఆ గ్రామములోని రెండు ముఠాలవారికి ప్రముఖపాత్ర ఉంటుంది. ఆ పార్టీలలో చేరకుండా ఆ గ్రామములో ఉండటం అసంభవం. ఉన్న ఊరువదిలి ఉద్యోగ ప్రయత్నంమీద పడ్డాడు. డిగ్రీలు ఉన్నవారికే దిక్కులేని ఈ రోజుల్లో అమరయ్య మొర ఆలకించేవాడే అగుపించలేదు. బస్తీ కాపురానికీ, ఉద్యో గమిప్పిస్తామన్నవారి ఉదరాలు నింపటా నికీ అయిదెకరాలు ఆఖరయింది. భార్య వంటిమీద బంగారంకూడా హారతి కర్పూ రంవలె హరించిపోయింది.

ఆఖరికి నలభైరూపాయల జీతంమీద షావుకారుగుమాస్తాగిరీ దొరికింది. సంవత్సరానికి రూపాయిచొప్పున జీతం వృద్ధిఅయింది. అయిదు సంవత్సరాలు సెను ట్లో డ్చిపనిచేస్తే అయిదురూపాయల జీతం పెరిగింది. ఉదయం ఏడుగంటలనుంచి రాత్రి ఏడుగంటలవరకు కొట్లో పని చెయ్యటం, రాత్రి యింటికివచ్చి రాతపని చూట్టం అతగాడి నిత్యవిధులు. గవర్న మెంటువారి ఉత్తరువుప్రకారం పనిచేయ వలసినది ఎనిమిదిగంటలే. కాని అది ఎక్కడా అచరణలో ఉండదు.

"ఆలోచనకు అంతులేకుండా ఉంది. ఏడుగంటలు కావస్తున్నది. కొట్టుకు వెళ్ళండి"అన్న భార్య మాటలు, ఆలోచనా సముద్రములో ఉన్న అమరయ్యను ఒడ్డుకు చేర్చినై.

"చూడు భ్రమరం! ఇవ్వాళ జీతము తీసుకుంటాను. జీతముతోపాటు ప్రతిఏడు నాకు యిచ్చేబోనసుకూడా యివ్వమని అడుగుతాను. వచ్చేటప్పుడు నీవు కోరిన వన్నీ తెస్తాను, సరేనా"!

"ఒకనెల జీతమేమిటండీ బోనసు; కార్మికులకు మూడు, నాల్గు నెలల బోనసు యిస్తారని వార్తాపత్రికల్లో వేస్తారే; మీ కారు ఒకనెలేనా యిచ్చేది?"

"నీవు రోజూ పేపరుచదవటంకూడా నా ప్రాణంమీదకే వచ్చింది ఇచ్చేవాళ్లు నాల్గు నెలలుకూడా యిస్తారు. ఇవ్వనివాళ్లుకూడా యిచ్చినట్లే చెప్తారు. అది అంతా అంకెల గారడీ. నీకు అర్థంకాదు"

"నాకు అర్థంగాకపోయినా అధికార్ల కర్థం కాదుటండీ?"

"వాళ్ళ కర్థమయినా కానట్లే ఉంటారు. ప్రభుత్వదృష్టికిగాని, ప్రజల దృష్టికిగాని రాని త్రిశంకుస్వర్గాలు మా వుద్యోగాలు"

"ఏదైతే నాకెందుకుగాని వచ్చేటప్పుడు మాత్రం నే చెప్పినవి మర్చిపోకండి"

సంచి చేత్తో పట్టుకుని అరువిచ్చే చిల్లర కొట్టువైపు దారితీశాడు భార్య మాటలు నెమరు వేసుకుంటూ.

"చూడు సుబ్బయ్యా! ధరలన్నీ తగ్గిపోయినా నీవు తగ్గించటంలేదే"

"అదేమిటండి; పేరుకోసం పేపర్లో వేసుకోటమేకాని, తగ్గించి అమ్మేసన్నాసి ఎవరండి! ఎక్కువరేటు పెట్టికొనితగ్గించి అమ్మితే యిల్లువాకిలి అమ్ముకోవాల్సిందే బాబూ"

"కిరసనాయిలు ఊళ్ళో కొంచెం తక్కువగా ఉందని తెలియగానే కాయకు అణా పెంచి అమ్మావుకదయ్యా. ధర పెంచేటప్పుడు లెక్క అవుసరం లేదనుకుంటా"

"వ్యాపారం అంటే ఏమిటిబాబూ! అణాడబ్బులకోసం అఘోరింపేగా! అది మీకు వేరే చెప్పాలా! అయినా ధరతగ్గిందన్నారు. మర్నాడే మళ్ళీ పెరిగిందన్నారు. మాబోటి చిన్నకొట్లవాళ్ళకు తెలిసేసరికే అంతా అయిపోయింది. వ్యాపారంలో వేలు, లక్షలు లాభాలుంటయ్యనుకుంటారు. వెనక్కితిరిగి చూసుకుంటే ఏమీ ఉండదు. అది సరేకాని బాబూ! క్రిందటినెలలో వాడుకున్న బాపతు అలాగే ఉండిపోయింది. ఈ నెలలో బాకీ మళ్లీ పెరిగిపోతున్నది. జీతం రాంగానే అంతా సర్దకపోతే బాగుండదు బాబూ"

కోమటి ఉపన్యాసం పొంతంకాక ముందే సంచి పట్టుకు సందుదాటాడు అమరయ్య. ఎదురుగా బట్టలకొట్టు కన్పించింది. ఆలోచిస్తూ లోపలి కడుగుపెట్టాడు.

"షావుకారుగారు! పిల్లలకు పనికొచ్చే చౌక్కాగుడ్డ చొకలో ఏమన్నా ఉందా"

"లేకేమండి! గజము రెండున్నర"

"అదేమిటండి అంత ధర చెప్తారు అల్కరకంగూడా! ధర తగ్గిపోయి బట్ట కొనే వాళ్ళేలేరని అనుకుంటున్నారే"

"అదేగుడ్డ అయిదురూపాయ లమ్మాము. ధరతగ్గటంవల్లే ఆరేటు కివ్వటం. అయినా బతిమాలి అమ్మాల్సినంత బట్ట మాదగ్గర లేదు కోటాలు రాక గోలపెట్టుంటే మిగిలిపోయిందని మీరంటున్నారు."

(46-వ పేజీ చూడండి)


వ్యాధిని ఎంతత్వరగా పోల్చుకుంటే అంతమేలు

మీ పసిపాపకు



పసితనంలో చిన్నపిల్లలు ప్రమాదకరమైన లివర్‌వ్యాధికి సామాన్యంగా గురి అవుతూ వుంటారు. సత్వరంగా చికిత్స చెయ్యకపోతే అది మాసాలకొద్దీ వేదన పడేటట్లు చేస్తుంది. కొన్నివేళల ప్రాణానికి అపాయంకూడా కలుగుతుంది. చీదరగా మందకొడిగా వుండడం, కొంచెం జ్వరము రావడం, అహారంపై అహితవు, వుబ్బిన పొత్తికడుపు, మలబద్ధకము లేదా అతివిరేచనాలు—ఇవి, లివరు వ్యాధికి అరంభంలో వుండే లక్షణాలలో కొన్ని. అటువంటప్పుడు తక్షణమే వైద్యుడికి చూపించండి. సాకల్యంగా లివరు వ్యాధిని పోల్చటంలోనూ పిల్లల లివరు స్ప్లీను వ్యాధులను కుదర్చడంలోనూ సుమారు 40 సంవత్సరాలనుండి జమ్మివారు ప్రఖ్యాతి పొందిరి.

జమ్మివారి

లివర్‌క్యూర్

(ఇప్పుడు మాత్రలరూపంలో దొరుకుతున్నది)



జమ్మి వెంకట రమణయ్య అండ్ సన్స్

మైలాపూరు, మద్రాసు. 4.

SISTA'S—J—280

బ్రాంచి: ఓరుగంటివారి వీధి, విజయనగరం సిటీ.

# ధర తగ్గింది

(5-వ పేజీ తరువాయి)

అర్థములేని ఆలోచనలకు అమరయ్యా దిట్ట కోటాతీసుకునేవాళ్లు లేరని మిల్లువాళ్లు, యిచ్చేవాళ్లు లేరని కొట్టువాళ్ళు. ఇందులో ఏది నిజం. అమెరికానుంచి ఆహారధాన్యాలు వస్తూనే ఉన్నై, మిల్లులలో గుడ్డ మూల్గుతూనేఉంది. రేషను షాపుల్లో గోధుమలు కాని, సరసమయిన ధరలకు సన్నగుడ్డ కాని తేవటం సామాన్య మానవుడికి సాధ్యం కావటంలేదు.

అమరయ్యా ఆలోచనలో ఉన్నా పరిచిత మయిన పాదాలు కొట్టుకు చేర్చినై.

"షావుకారుగారూ! ఇంట్లో చాలా యిబ్బందిగాఉంది ఈవేళ జీతం యిప్పిస్తే చాలా సంతోషిస్తాను. జీతంతో పాటు నాకు యివ్వాల్సిన బోనసుకూడా యిస్తే చాలా సహాయముచేసినట్లవుతుంది"

"నాగాలు పోను మీకు నలభయిరూపాయలు వస్తయి ఇవిగో తీసుకోండి. ధరలన్నీ పడిపోయినయి. వ్యాపారము వెల్లకిలా పడేటట్టుంది. వచ్చేనెలనుంచి యిదివరకటి జీతం నలభైచొప్పున వాగుకోండి. ఈ సంవత్సరం బోనసుకూడా యివ్వలేను" అన్నాడు.

అమరయ్యా నెత్తిన పిడుగు పడినట్లయింది. పాలు, పెరుగు, యింటిఅద్దె, చిల్లరకొట్టుబాకి, చాకలి... ఖర్చులనుగురించి ఆలోచించలేకపోయాడు. భార్య అడిగిన చిట్టిపాప చిన్నచొక్కాసంగతి స్ఫురణకు వచ్చింది. కళ్ళనీళ్ళతో కాళ్ళీడ్చుకుంటూ కొంపజేరాడు. భర్త చేతిలోని ఖాళీసంచి, కళ్లనీళ్లు చూచి భార్య భ్రమరాంబ భయపడ్డది "అదేమిటండి అలా ఉన్నారు" అంది ఆదుర్దాగా.

"నీవు చెప్పింది అక్షరాలా నిజం. ధర తగ్గింది" అన్నాడు భార్య ముఖంలోకి పిచ్చిగా చూస్తూ.

"మీరు చెప్పేది సరిగ్గా చెప్పండి నాకు అర్థంకావటంలేదు"

"బజార్లో వస్తువుల ధరలు ఆకాశాన్ని అందుకుంటూనే ఉన్నై. అధికార్ల ఆందోళన, వర్తకులహంగామాల ఫలితంగా నాబోటివాళ్ళ జీవితపు ధరలు తగ్గినై. అమ్మే సరుకులో అణా తగ్గించని మా షావుకారు, ధరలు తగ్గినయ్యని నా జీతం తగ్గించి, బోనసు ఆపివేశాడు. అన్నాడు ఎదురుగా కన్పించే షావుకారు మేడవ అంతస్తుపై ఎగిరే మూడురంగుల జండావైపు చూస్తూ. ★


## మణీ,

నాయనమ్మ నీకొరకు బెంగతో మంచంపట్టి ప్రమాదస్థితిలో ఉన్నది. నీవు వచ్చి ఆమెను కాపాడవలెను. నీకొరకు ఆతురతతో నిరీక్షిస్తున్నాము. నీఅడ్రసు తెలిపితే ప్రయాణపుఖర్చుకు సొమ్ము పంపుతాము. తప్పక రావలెను.

పెనుబోలు సుబ్బరామయ్యా.


# ఇంగిత జ్ఞానం

(26-వ పేజీ తరువాయి)

పని చెయ్యి, నేను గట్టుమీద కూర్చుంటాను" అని నాగుల్ని బ్రతిమి లాడాడు. నాగులు అన్నగారు కదా అని అందుకు వప్పుకొని తాను పనిలోకి వెళ్లాడు.

ఇంకేం! రాముడు వెళ్ళి పొలంగట్టుమీద ఠీవిగా కూర్చున్నాడు. ఇంతలో ఆ దారిన గవరయ్య పోవడం చూచి రాముడు అతన్ని పిలచి 'ఏమండీ గవరయ్య గారూ! యీ మధ్య బొత్తిగా కనుపించడమే మానేశారు' అని పరామర్శించాడు. గవరయ్య పుట్టెడు దుఃఖంతో 'యీ మధ్య నాభార్య చనిపోయిందండీ! ముఖం చెల్లక బయటికి రావటంలేదు' అని చెప్పాడు. వెంటనే రాముడు అందుకొని 'అయ్యో! అలాగా పాపం, నిజంగా ఎంత గొప్ప యిల్లాలు అండీ ఆవిడ! ఆవిడ మీకే గాదు, వూరి వారందరికీ భార్యలా మెలిగిందంటే నమ్మండి' అంటూ సానుభూతి ప్రకటించబోయాడు. తమ్ముడిలాగే. కాని రాముడి మాటలు వినగానే గవరయ్య మండి పడి 'ఓరి వెధవా! నా భార్యని పట్టుకుని వూరి వారందరికీ భార్య అంటావా?' అని చెడామడా నాలుగు తన్నాడు. నాగులు కూడా వచ్చి 'బాగా బుద్ధివచ్చిందా' అని నాలుగు చీవాట్లు వేశాడు దాంతో రాముడు లెంపలు వేసికుని 'సోమూ! నాకీ ముళ్లకంచె పని వద్దులే! ఆపొలంపనే నాకు చా'లని తనపని చేయుడానికి వెళ్ళిపోయాడు.

★

# వ్యాఖ్యలు, విమర్శలు

(3-వ పేజీ తరువాయి)

ప్రాయోపవేశం ప్రారంభించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని గూర్చి పలువురికి ఆందోళన కలిగించారు. స్వరాష్ట్ర స్థాపన వంటి వుద్యమాలలో నిరశనవ్రతం వంటివి ప్రయోగించరాదని కాంగ్రెసు పెద్దలు అంటున్నారు. ఒక్కరుగాగాక ప్రజావుద్యమంగా నడిపిస్తేనేకాని ఆంధ్రరాష్ట్ర స్థాపన సాధ్యపడేది కాదని కమ్యూనిస్టు నాయకులు ప్రకటనలు చరుస్తున్నారు.

ఇప్పటి కన్నిసార్లో ఆంధ్రరాష్ట్రం వచ్చేస్తుందని అనిపించింది. ఎప్పటికప్పుడు ఏదో కాస్తపని జరిగిందంటే ఆంధ్రరాష్ట్రం అవతరించటం సంభవమని తోచింది. ఇప్పుడు కూడా అలాగే ఆంధ్రరాష్ట్రస్థాపన వాంఛిస్తున్న అన్ని పార్టీల వారూ మద్రాసుపై హక్కు వదులుకొంటున్నామంటూ సంయుక్త ప్రకటన ఒకటి చేస్తే ఆంధ్రరాష్ట్ర విభజన కలాపానికి ప్రభుత్వం పూనుకోవచ్చు నని పిస్తున్నది. కానీ అన్ని పార్టీలవారూ యిలాటి ప్రకటన చేయటానికి కలిసి వస్తారా అనేది మాత్రం, ఎప్పటిలాగే అనుమానాస్పదం. పట్టుదలలకుపోయి, రాజధానికోసం పెనుగులాడి రాష్ట్రాన్నే వదులుకోవటం ఎంత అవివేకమో అందరూ గుర్తిస్తే అంతే చాలు. ★